క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో కలశ పూజలు



ఇంజేడు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ శిఖరంపై కలశాలకు పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం ముఖద్వారంపైనున్న రాజగోపురం పై కలశాలకు భక్తి శ్రద్ధలతో మండల పూజ, ప్రత్యేక అభిషేకాలు ఆదివారం నిర్వహించారు. ఈ నెల 3న ఆలయ ముఖద్వారంపై నూతనంగా నిర్మించిన రాజగోపురం (గాలిగోపురం)పై కలశాలకు శిఖర, ప్రాణ ప్రతిష్ఠ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. 21 రోజుల పండుగ పురస్కరించుకుని పాణ్యం కృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అనంతయ్య, రమణయ్య భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నిర్వాహకులు కామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, చలపతిరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ఓంశాంతి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): రక్తదానం చేయడం వల్ల ఆపద సమయాల్లో పలువురికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని ఓం శాంతి మాతాజీలు హరిప్రియ, సావిత్రి పేర్కొన్నారు. విశ్వబంధుత్వ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఎన్‌జీఓ కాలనీలో ఓం శాంతి మందిరంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా రాజయోగిని ప్రకాశమని దాది చిత్రపటానికి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఓంశాంతి సభ్యులు 40మంది రక్తదానం చేశారు. డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, సతీష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీ,కొడుకుకు గాయాలు




గాయపడిన పూజ, వినయ్

ఆళ్లగడ్డ: మండలంలోని బత్తలూరు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ, కొడుకు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. హైదరబాద్ మనికొండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పూజ అహోబిలం క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందకు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో బత్తలూరు సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న బ్రిడ్జినీ ఢీకొట్టి లోపలికి పడిపోయింది. ప్రమాదంలో కారులో ఉన్న పూజ, కుమారుడు వినయ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో నంద్యాల వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారికి చీర,సారె, పండ్లు, పూలతోపాటు నైవేద్యంగా పిండి వంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూజల అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

బిషప్‌కు సన్మానం



బిషప్ సంతోష్ ప్రసన్నరావును సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ అధ్యక్షుడు బిషప్ రైట్ రెవరెండ్ సంతోష్ ప్రసన్నరావును ఆదివారం హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్–2 కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నూతనంగా బిషప్‌గా పట్టాభిషేకం పొందిన తర్వాత పాస్టరేట్–2 ఆలయాన్ని బిషప్ సందర్శించారు. బిషప్ మాట్లాడుతూ కనికరం, న్యాయం, సమాధానంతో ముందుకెళ్తే ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందుతారన్నారు. పాస్టరేట్ డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్, గురువులు విజయ్‌కుమార్, జోయెల్, సెక్రటరీ బాలయ్య, కిరణ్ కుమార్, కిరణ్, సామేలు, భారతి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు




నంద్యాలలో గోడౌన్ నిర్వాహకుడితో మాట్లాడుతున్న ఏఎస్పీ, ఆళ్లగడ్డలో ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న సీఐలు, వ్యవసాయ శాఖ అధికారులు

నంద్యాల (అర్బన్): పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో పోలీసులు, వ్యవసాయాధికారలు ఆదివారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. యూరియా నిల్వలపై ఏఎస్పీ మందాజావళి ఆధ్వర్యంలో రెండు బృందాలు సుదర్శన్ ట్రేడర్స్, రేఖా గోడౌన్స్, నరసింహారెడ్డి గోడౌన్స్, రామకృష్ణారెడ్డి గోడౌన్స్, అవేజ్ గోడౌన్స్‌లలో యూరియా నిల్వలు, ధ్రువపత్రాలను పరిశీలించారు. గోడౌన్లలో నిల్వలు, అమ్మకాలకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని మండల వ్యవసాయాదికారి ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు ఈశ్వరయ్య, కంబగిరిరాముడు పాల్గొన్నారు.

- **గోస్పాడు:** స్థానిక నాలుగు ఎరువుల దుకాణాల్లో యూరియా నిల్వలపై వ్యవసాయ, పోలీసు అధికారులు ఆదివారం ఉమ్మడిగా తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయాదికారి స్వప్నికారెడ్డి, ఎస్‌ఐ సుదాకర్‌రెడ్డి దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలినా, అనధికారికంగా అమ్మినట్లు తెలిసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.
- **రుద్రవరం:** డీఎస్పీ ప్రమోద్, వ్యవసాయ శాఖ ఏఈఓ రాజు, వీఆర్వో అంకాల్ తదితరులు ఆదివారం స్థానిక ఎరువులు,పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఎరువు బస్తాల నిల్వలు, వాటికి సంబంధించిన రికార్డులు, బిల్ బుక్కులను పరిశీలించారు. వారు దుకాణాదారులకు పలు సూచనలు చేశారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువు బస్తాలు, పురుగు మందులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. అలాగే ఎరువు బస్తాలు నిర్ణీత ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రుద్రవరం ఎస్‌ఐ మహమ్మద్ రఫీ ఉన్నారు.

ఎరువులు పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు

ఆళ్లగడ్డ: రైతులకు అందించాల్సిన ఎరువులు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఆళ్లగడ్డ సీఐలు మురళీధర్‌రెడ్డి, యుగంధర్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు రుజువైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎరువుల లెక్కలకు సంబంధించి ఫిజికల్, ఆన్‌లైన్ రికార్డులతో లావాదేవీలు పారదర్శకంగా ఉండాలని చెప్పారు.

- **శిరివెళ్ల:** మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. సీఐ దస్తగిరిబాబు, ఎస్‌ఐ చిన్న పీరయ్య ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలు, గోడౌన్లను పరిశీలించి ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. యూరియా నిల్వలపై ఆరా తీశారు. అధిక రేట్లకు అమ్మితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



రుద్రవరంలో ఎరువుల దుకాణాల్లో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు



శిరివెళ్లలో నిల్వలను పరిశీలిస్తున్న పోలీస్‌లు

డీఈఓ హామీతో ధర్నా వాయిదా

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 26వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు నంద్యాల జిల్లా ఫ్యాప్టో చైర్మన్ శివయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తలపెట్టిన ధర్నాను డీఈఓ ఇచ్చిన హామీ మేరకు వాయిదా వేసినట్లు చెప్పారు. సంఘం నాయకులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీఈఓ సానుకూలంగా స్పందించారన్నారు. సమావేశంలో నాయకులు గోపాలకృష్ణయ్య, రామ్మోహన్, రామచంద్రారెడ్డి, దస్తగిరి, నాగేంద్రకుమార్, సాంబశివుడు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న ఫ్యాప్టో సంఘం నాయకులు

పెద్దకంబలూరులో కార్డెన్ సెర్చ్



గ్రామస్తులకు సూచనలిస్తున్న సీఐ



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లు

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరులో ఆదివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. శిరివెళ్ల సీఐ దస్తగిరిబాబు,రుద్రవరం ఎస్‌ఐ మహమ్మద్ రఫీ పోలీసు బలగాలతో వెళ్లి పలువురు అనుమానితుల ఇళ్లు, గడ్డివాములు వంటి ప్రదేశాల్లో సోదాలు చేశారు. అలాగే చిల్లర దుకాణాల్లోనూ తనిఖీలు చేశారు.అలాగే వాహనాలు తనిఖీ చేసి అనుమతి పత్రాలు, నంబర్ పేట్లు లేని 11 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. అనంతరం వారు గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని, వినాయక చవితి పర్వదినాన్ని ప్రశాంతగా జరుపుకోవాలని సూచించారు. వినాయక మండపాలు ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు రాంభూపాల్ రెడ్డి,బాలన్న ఉన్నారు.

జేవీవీ చర్యలు అభినందనీయం



మాట్లాడుతున్న రామచంద్రారావు

నంద్యాల(న్యూటౌన్): సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలతో పాటు ఇతర సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమని సీనియర్ న్యాయవాది రామచంద్రారావు, ప్రముఖ కార్డియాలజిస్ట్ క్రాంతి చైతన్య, న్యూక్లియస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సన్‌రైజ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభలను జేవీవీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జేవీవీ లక్ష్యాలు, ఆశయాల గురించి వివరించారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ప్రతినిధుల సభలో నంద్యాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్ తెలిపారు. అధ్యక్షుడిగా డోస్ రామ్మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులుగా రామరాజు, లతీఫ్, మరియదాసు, సర్వాజ్ఞమూర్తి, జిల్లా కార్యదర్శులుగా చిన్నయ్య, పునీత్, జయకర్, మాణిక్యంశెట్టి, సభ్యులుగా బాబాఫక్రుద్దీన్, భాస్కర్, రమేష్‌నాయుడు, నరసింహారెడ్డి ఎన్నికయ్యారని వివరించారు.

హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదు



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసిన దృశ్యం



విద్యార్థినులకు విద్యా సామగ్రి, న్యాపికిన్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల: హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, వారిని దూరం పెట్టొద్దని జిల్లా టీబీ అధికారిణి తేజశ్వణి పేర్కొన్నారు. హెచ్‌ఐవీతో బాధపడుతున్న 6 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు చైతన్య కళాభారతి సంస్థ, ఎస్‌బీసీఈడబ్ల్యూటీ వారి ఆధ్వర్యంలో సైకిళ్లు, విద్య సామగ్రి, శానిటరీ న్యాప్‌కిన్స్‌ను సంస్థ అధ్యక్షుడు వాసగిరి విజయభాస్కర్ ఆదివారం పంపిణీ చేశారు. నంద్యాల డివిజన్‌లో 27 మంది విద్యార్థులకు, ఆదోని డివిజన్‌కు చెందిన 19 మంది, కర్నూలు డివిజన్‌కు చెందిన 16 మంది విద్యార్థినులకు అందజేశారు. తేజశ్వణి, ఉమ్మడి కర్నూలు జిల్లా నేస్తం నెట్‌వర్క్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే మందులు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయుడు మద్దిలేటి, సొసైటీ నాయకురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు



మాట్లాడుతున్న టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు: దొంగతనాలకు పాల్పడిన వారు ఎవరూ చట్టం నుంచి తప్పించుకోలేరని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని నాగటూరు గ్రామ పొలిమేరలో ఉన్న మల్యాల ఎత్తిపోతల పథకం రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పగలకొట్టి కాపర్ వైర్, కాపర్ కడ్డీలు చోరీ చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ, ఎస్‌ఐ చంద్రశేఖర్ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకానికి చెందిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన కాపర్ వైర్, కాపర్ కడ్డీలను మహారాష్ట్రంలోని పర్బని జిల్లా తడ్కలాస్, పుల్కలస్ గ్రామాలకు చెందిన రాజేంద్ర బబస్ బోలె, నాందేవ్ బిలాస్‌రావ్, సంజయ్ లక్ష్మణ్ హర్ గావోకర్‌లను అరెస్టు చేయడం జరిగిందన్నారు. లక్ష రూపాయల విలువ చేసే కాపర్ వైర్, కాపర్ కడ్డీలు నెల రోజుల క్రితం దొంగలించారని తెలిపారు. టెక్నికల్ ఆధారాలతో దొంగతనాలకు పాల్పడిన వారిని గుర్తించి వారం రోజుల్లో పట్టుకోవడం జరిగిందని చెప్పారు. నిందితుల నుంచి బొలెరొ వాహనం, బైక్, లక్ష రూపాయలను, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు మహారాష్ట్రకు ఎస్‌ఐ చంద్రశేఖర్ పోలీసులు బాలకృష్ణ, ఓబులయ్య, నాగరాజు, సిబ్బంది ఈ కేసును ఛేదించేందుకు ఎంతో కష్ట పడ్డారని అభినందించారు.

శ్రీశైలం ముంపు బాధితులపై విచారణ



రైతుల జీ విచారిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్

నందికొట్కూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో భూములు కోల్పోయిన బాధితులను ఆదివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్ విచారించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో భూములు కోల్పోయిన రైతులు లోక్ అదాలత్‌ను ఆశ్రయించారన్నారు. బాధితులను విచారించి నివేదికను పైస్థాయి అధికారులకు అందజేస్తామని చెప్పారు.

నేడు పీజీఆర్ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సువర్ణాదేవి ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

మద్యం మత్తులో లైన్‌మన్



తాగి పడిపోయిన విద్యుత్ లైన్‌మన్

రుద్రవరం: మండల కేంద్రంలో విద్యుత్ లైన్‌మెన్‌గా విధులు నిర్వ హిస్తున్న వినోద్ నిత్యం మద్యం మత్తులో తూలుతున్నాడు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏదైన విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించాల్సి ఉండగా.. విధులను వదలేసి, వేళాపాల లేకుండా నిత్యం మద్యం మత్తులో ఉంటున్నాడు. తాగి మోటార్ సైకిల్ ప్రయమాణం చేస్తూ.. వాహనాన్ని నడపలేక ఎక్కడ పడితే అక్కడ పడిపోతున్నాడు. దీంతో స్థానికులు విద్యుత్ సమస్యలకు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. ఆయన ప్రవర్తనపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆ శాఖ ఏఈ రాజశేఖర్‌ను వివరణ కోరగా.. ఆ ఉద్యోగి నిత్యం మద్యం సేవిస్తుండటం వాస్తవమేనని గతంలో ఆయనపై పలువురు రైతులు ఫిర్యాదు చేశారని, తోటి సిబ్బందిని దుర్భాషలాడుతున్నాడని, పద్ధతి మార్చుకోమ్మని ఉన్నతాధికారులు కూడా మందలించారని.. అయినా ఆయనలో మార్పురాలేదని చెప్పారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలకు సిఫార్స్ చేస్తానని తెలిపారు.

సైక్లింగ్‌ను అలవాటు చేసుకోండి



సండేస్ ఆన్ సైకిల్ యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఐ మంజునాథ

నంద్యాల: సైక్లింగ్‌ను అలవాటు చేసుకొని శారీరక ధృడత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సీఐ మంజునాథ పేర్కొన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా ఎస్పీ పోలీసు కార్యాలయం వద్ద సండేస్ ఆన్ సైకిల్ ర్యాలీని సీఐ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవన శైలిలో శారీరక శ్రమ లేకుండా ఆధునిక సౌకర్యాలతో జీవనం సాగించడం వల్ల శారీరక చురుకుదనం లేకపోవడంతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని, ప్రతి ఒక్కరూ కొంత సమయం సైకిల్ తొక్కడం అలవాటు చేసుకోవాలని చెప్పారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవారు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులుగావించి వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం నంద్యాలకు చెందిన హెచ్.పద్మనాభయ్య రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు కె.శివప్రసాద్‌కు అందజేశారు. దాతను దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

యూరియా కొరత తీర్చడంలో ప్రభుత్వం విఫలం

- అధికార పార్టీ నాయకులు పక్కదారి పట్టిస్తున్నారు
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలో యూరియా కొరతను తీర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, అధికార పార్టీ నాయకులు యూరియాను పక్కదారి పట్టిస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వ భూములను దారాదత్తం చేస్తున్నారన్నారు. నంద్యాల జిల్లాలో పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. యూరియా కొరతతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ తగ్గించాలన్న ఉద్దేశంతో యూరియాను సరఫరా చేయడం లేదని మండిపడ్డారు. రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా కాకుండా అధికార పార్టీ నాయకుల చేతుల్లోకి యూరియా వెళ్లిపోతుందని ఆరోపించారు. పంటలకు అవసరమైన రసాయనిక ఎరువులు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులను ఆదుకుంటామని చెబుతున్నా, ఆచరణలో చూపడం లేదన్నారు. పొగాకు రైతులను ఆదుకోవడంలో జిల్లా మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, నాయకులు రాజశేఖర్, రామచంద్రుడు, సుబ్బరాయుడు, రాజు పాల్గొన్నారు.

ఉమ్మీద్ పోర్టల్‌ను బలవంతంగా అమలు చేయొద్దు



మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఉమ్మీద్ పోర్టల్‌ను బలవంతంగా అమలు చేయవద్దని నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక క్రాంతి రేఖా గ్రంథాలయంలో ముస్లిం జేఏసీ కన్వీనర్ మౌలాలా అబ్దుల్ సమ్మద్, ఎస్ఎండీ అబులైజ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు.. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశంలోని అన్ని ముస్లిం సంఘాలను కలుపుకొని సుప్రీంకోర్టులో ఈ చట్టంపైన సవాల్ చేశారన్నారు. ప్రస్తుతం సుప్రీం కోర్టులో కేసు నడుస్తుందని, ప్రభుత్వం వక్ఫ్ ఆస్తుల వివరాలను అమలు చేయడాన్ని ముస్లిం పర్సనల్ లా బోర్డు ఖండిస్తుందన్నారు. ఇది వక్ఫ్ ఆస్తుల రక్షణకు విఘాతమని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వక ముందు ముస్లింలకు అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని మరిచి ముస్లింలకు ఏ మాత్రం ఇష్టం లేని సవరణ చట్టానికి ఇతర రాష్ట్రాల కంటే ముందే మద్దతు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. మస్తాన్, బాషా, ఎజాజ్ హుసేన్, మజీద్ ఖాన్, అయూబ్, సమీర్, మన్సూర్‌బాషా పాల్గొన్నారు.

డీఏపీ బస్తాల సీజ్



దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

బండి ఆత్మకూరు/ మహానంది : మండలంలోని పార్నపల్లి గ్రామంలో ప్రశాంతి ఫెర్టిలైజర్ దుకాణంపై వ్యవసాయ అధికారులు, కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్, పోలీస్ అధికారులు కలిసి సంయుక్తంగా ఆదివారం చేపట్టిన దాడుల్లో 103 బస్తాల డీఏపీని సీజ్ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్ పవన్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. నాగరాజు అనే రైతుకు బస్తా డీఏపీ ఎంఆర్‌పీ రూ.1350 కాగా, దుకాణం వారు రూ. 1420లకు అమ్మినట్లు, ఫోన్ పే ద్వారా లావాదేవీలు జరిగినట్లు ఆధారాలు లభించాయని చెప్పారు. సదరు దుకాణంపై ఈసీ యాక్ట్ 1955 ప్రకారం 6ఏ కేసు నమోదు చేసి రూ.1,39,050 విలువగల 103 బస్తాల డీఏపీని సీజ్ చేశామన్నారు. తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు రిపోర్టు పంపిస్తామని తెలిపారు. అలాగే మహానంది మండలంలోని గాజులపల్లెలో దీప్తి ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో 131 బస్తాల డీఏపీ ఎరువులను సీజ్ చేసినట్లు వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు రూ.1,76,850 విలువ ఉంటుంది. యూరియా 1.845 మెట్రిక్ టనుల యూరియా అమ్మకాలను నిలుపుదల చేశారు. దాడుల్లో కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ వెంకట ప్రసాద్, ఎస్‌ఐ జగన్‌మోహన్ పాల్గొన్నారు.

బానకచెర్ల నుంచి 30,000 క్యూసెక్కుల నీటి విడుదల



బానకచెర్ల క్రస్ట్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి ఆదివారం 30,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి ఎస్ఆర్ఎంసీ ద్వారా ఇన్‌ఫ్లో ఉన్న 30,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. తెలుగుగంగ(వీబీఆర్)కు 14,000, జీఎన్ఎస్ఎస్‌కు 12,000, కేసీసీ ఎస్కేప్‌చానల్‌కు 4,000 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని వివరించారు.

వైభవంగా గోపాలుడి గ్రామోత్సవం



పేరుసోములలో శ్రీకృష్ణుని గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

సంజామల: మండలంలోని పేరుసోముల గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు కొనసాగిన ఉత్సవాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు ఆదివారం స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి విశిష్ట పూజలు చేశారు. అనంతరం భగవద్గీత శ్లోకాల పఠనంతో శ్రీకృష్ణుని గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక పేరుసోముల కమిటీ అధ్యక్షుడు సురేష్, రెడ్డిపల్లె మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, తత్త్వేశ్వరరెడ్డి, వెంకటరామిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కమిటీ సభ్యులు మిక్కినేనిపల్లె పెద్దయ్య, గణపతి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.